క్లుప్తంగా

తిరునాల ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో శ్రీచౌడేశ్వరి దేవి

కోడుమూరు రూరల్: పట్టణంలోని చౌడేశ్వరీదేవి తిరునాల ఉత్సవాలు గురువారం గుమ్మటోత్సవంతో ప్రారంభమయ్యాయి. ఉత్సవాల ప్రారంభం సందర్భంగా ఆలయ అర్చకులు ఉదయాన్నే అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారి ప్రభోత్సవం నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నారు.

రేపు సామూహిక సత్యనారాయణ వ్రతం

గూడూరు రూరల్: మండల పరిధిలోని మల్లాపురం లక్ష్మిచెన్నకేశవస్వామి ఆలయంలో ఈనెల 24న తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో సత్యనారాయణస్వామి సామూహిక వ్రతం నిర్వహించనున్నట్లు హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా కార్యనిర్వహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తెలిపారు. కార్యక్రమం పోస్టర్‌ను గురువారం సర్పంచు భాగ్యమ్మతో కలిసి ఆయన విడుదల చేశారు.

ముగిసిన దేవర

సి.బెళగల్: మండల పరిధిలోని చింతమాను పల్లె గ్రామంలో మారెమ్మ అమ్మవారి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. దేవర సందర్భంగా మూడు రోజులుగా వివిధ కార్యక్రమాలు చేపట్టిన భక్తులు చివరి రోజు గ్రామంలో ప్రత్యేక ఊరేగింపుతో ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించి పూర్ణహారతితో వేడుకలకు ముగింపు పలికారు. ఈ సందర్భంగా సర్పంచ్ రోజా కుటుంబ సభ్యులతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై కళాజాతా

గడివేముల: ఆర్థిక అక్షరాస్యతపై గడివేముల ఎస్‌బీఐ బ్రాంచ్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలోని మంచాలకట్ట బ్యాంకులో లావాదేవీలపై, సామాజిక భద్రత పథకం, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన, అటల్ పింఛన్ యోజన నగదు రహిత లావాదేవీలు, సైబర్ మోసాలు,జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. జీరో అకౌంట్, గోల్డ్ లోన్ తదితర వాటిపై అర్థమయ్యే విధంగా మాటల, పాటల, మ్యాజిక్ షోల ద్వారా తెలియజేశారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ ప్రదీప్, బీసీ పాయింట్ కిరణ్, వెంకటేష్, కళాజాతా బృందం తేజ కుమార్ డప్పు ప్లేయర్ శ్రీనివాసులు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

టెంకాయల కృష్ణపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు (న్యూటౌన్): ప్రభుత్వ వైద్యశాలలో స్వీపరుగా పని చేసే పేద మహిళల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక వడ్డీలకు అప్పులిస్తూ సకాలంలో వడ్డీ చెల్లించని దళిత మహిళలను వేధించిన టెంకాయల కృష్ణ, ఆయన భార్యపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఓ దళిత మహిళతో ప్రాంసరి నోటు టైం అయిపోయిందని మూడవ పట్టణ పోలీస్ స్టేషన్‌కు పిలిపించి పోలీసుల ఒత్తిడితో తెల్లకాగితంపై బలవంతంగా సంతకాలు చేయించారని ఆరోపించారు.

రూ.లక్ష అపరాధ రుసుం వసూలు

కర్నూలు (న్యూటౌన్): తుగ్గలి మండలం బొందెమడుగుల గ్రామంలోని సర్వే నంబర్ 589లో అక్రమంగా గ్రానైట్ తవ్వి తరలించిన కేసులో ఒక హిటాచీని సీజ్ చేసి రూ.లక్ష అపరాధ రుసుం విధించి వసూలు చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజశేఖర్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గతేడాది సెప్టెంబర్‌లో డోన్ పట్టణానికి చెందిన రత్నమయ్య హిటాచీతో తవ్వి అక్రమంగా గ్రానైట్‌ను తరలించడంతో హిటాచీని సీజ్ చేసి తుగ్గలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశామన్నారు. రూ.లక్ష అపరాధ రుసుం చెల్లించడంతో హైకోర్టు ఆదేశాల మేరకు సీజ్ చేసిన హిటాచీని విడుదల చేశామన్నారు.

శరవేగంగా బ్రిడ్జి నిర్మాణ పనులు



పిల్లర్లు నిర్మిస్తున్న దృశ్యం

కల్లూరు: మండల పరిధిలోని నెరవాడ గ్రామం వక్కెర వాగుపై ప్రభుత్వం ప్రజల సౌకర్యార్థం సుమారు రూ.35లక్షల వ్యయంతో ఫూట్ ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తోంది. బ్రిడ్జి పనులు శరవేగంగా సాగుతున్నాయి. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బ్రిడ్జి పనులు సకాలంలో పూర్తి చేయాల కోరుతున్నారు.

రహదారులపై రయ్..రయ్!

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పల్లె రోడ్లకు ప్రాధాన్యం
- ఇప్పటికే పలు గ్రామాల రోడ్ల నిర్మాణం పూర్తి
- నేడు పడిదెంపాడు–పూడూరు రోడ్డుకు శంకుస్థాపన

జగనన్న ప్రభుత్వం పల్లె రోడ్లకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. టీడీపీ హయాంలో ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోకుండా అధ్వానంగా ఉన్న రోడ్లను సైతం బాగు చేసి ప్రయాణికులు రయ్‌ను దూసుకుపోయేలా రహదారులను తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే కోడుమూరు నియోజకవర్గంలోని పలు రోడ్లను నిర్మించిన ప్రభుత్వం.. నేడు పడిదెంపాడు–పూడూరు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపనకు సిద్ధమయ్యింది.

కర్నూలు సిటీ: కోడుమూరు నియోజకవర్గంలోని పల్లె రోడ్ల నిర్మాణానికి పాలకులు కృషి చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్న సమయంలో రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అప్పట్లో కనీసం మరమ్మతులు కూడా చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే రోడ్ల నిర్మాణాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. నియోజకవర్గంలోని కర్నూలు రూరల్ మండలంలో పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ రహదారులున్నాయి. వీటిలో కర్నూలు నుంచి ఉల్చాల, రేమట మీదుగా సి.బెళగల్ మండలం కొత్తకోట గ్రామం వరకు రూ.6 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం చివరి దశలో ఉంది. టీడీపీ హయాంలో తూతూ మంత్రంగా వేసిన కర్నూలు–సుంకేసుల రహదారి అప్పట్లో ఏడాదిన్నరకే దెబ్బతినడంతో వైఎస్సార్‌సీపీ పాలనలో రూ.1.30 కోట్లతో ఆర్అండ్‌బీ అధికారులు మరమ్మతులు చేపట్టారు. మిగిలి పోయిన పనులను రూ.10 కోట్లతో చేశారు. పంచలింగాల నుంచి గొందిపర్ల వరకు రూ.15 కోట్లతో రోడ్డు వేశారు. జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ సమీపంలోని నంద్యాల రోడ్డు నుంచి పసుపుల, సుద్దిరెడ్డిపల్లె మీదుగా కర్నూలు–గుంటూరు రోడ్డు వరకు రూ.10 కోట్లతో పనులు చేపట్టారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో కర్నూలు–గుంటూరు రోడ్డు నుంచి పదిదెంపాడు మీదుగా పూడూరు, కోళ్లబాపురం వరకు 14 కి.మీ మేరకు రూ.11.85 కోట్లతో రోడ్డు నిర్మాణాన్ని చేపట్టనున్నారు. జి.పుల్లారెడ్డి కాలేజీ నుంచి జగన్నాథగట్టులోకి ట్రిపుల్ ఐటీ వరకు రూ.4 కోట్లతోను, నేషనల్ లా యూనివర్సిటీకి రూ.2 కోట్లతో బీటీ రోడ్లు వేశారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు తుంగభద్ర నది నుంచి ఇసుక విచ్చల విడిగా దోపిడీ చేయడంతో రోడ్లు గుంతలు గుంతలు పడి చిద్రమైంది. ఈ రోడ్డును ఎన్నికల్లోపే వేసేందుకు పనులు చేపట్టనున్నారు. అదే విధంగా గొందిపర్ల గ్రామం నుంచి ఇందిరమ్మకాలనీ వరకు రోడ్డు అధ్వానంగా ఉండడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడేవారు. ఆ రోడ్డును రూ.38.40 లక్షలతో బీటీ రోడ్డు వేశారు.



నాడు - ఉల్చాల - రేమట రోడ్డు



నేడు- ఉల్చాల - రేమట రోడ్డు



గొందిపర్ల నుంచి ఇందిరమ్మ కాలనీకి వేసిన బీటీ రోడ్డు

పడిదెంపాడు-పూడూరు రోడ్డుకు నేడు శంకుస్థాపన

కర్నూలు రూరల్ మండల పరిధిలో కర్నూలు–గుంటూరు రోడ్డు నుంచి పడిదెంపాడు మీదుగా పూడూరు, కోళ్లబాపురం వరకు బీటీ రోడ్డును వేసేందుకు శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, అధికారులతో పాటు వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సతీష్ హాజరుకానున్నారు.



పడిదెంపాడు-పూడూరు రోడ్డు

డాక్టరేట్ ప్రదానం

కర్నూలు కల్చరల్: నగరానికి చెందిన కొత్త కాప గౌతమి తిరుపతి ఐఐటీలో జరిగిన స్నాతకోత్సవంలో డాక్టరేట్ అందుకున్నారు. హైదరాబాద్ అమిటీ గ్లోబల్ బిజినెస్ స్కూల్‌లో ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న గౌతమి 'ఫైనాన్సియల్ డెవలప్‌మెంట్ అండ్ ఇండస్ట్రియలైజేషన్ - ఎంపిరికల్ అనాలసిస్' అంశంపై డాక్టర్ రాహుల్ ఎ సిరోహి పర్యవేక్షణలో చేసిన పరిశోధనలకు గానూ డాక్టరేట్ అందుకున్నారు.

సెబ్ సోదాలు

కర్నూలు (టౌన్): సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్ పర్యవేక్షణలో గురువారం అధికారులు విస్తృత సోదాలు నిర్వహించారు. ఈ.తాండ్రపాడు గ్రామంలోని బి.గంగావతి ఇంటి నుంచి 47 ఓల్డ్ అడ్మిరల్ మద్యం బాటిళ్లు, సుంకేసుల చెక్‌పోస్టు వద్ద ఆల్టో కారులో అక్రమంగా తరలిస్తున్న 8 ఇంపీరియల్ బ్లూ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ కె.ఆర్ రాజేంద్రప్రసాద్ వెల్లడించారు. స్టాంటన్‌పురం వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను జప్తు చేసి రూ.10 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

శిరీష మృతిపై విచారణ వేగవంతం చేయాలి

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు

సాక్షి, అమరావతి: కర్నూలు పట్టణంలో గిరిజన మహిళ శిరీషాబాయి అనుమానాస్పద మృతిపై పోలీసులు విచారణ వేగవంతం చేయాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు ఆదేశించారు. ఈ కేసుపై స్పందించిన ఆయన గురువారం ప్రకటన విడుదల చేశారు. గిరిజన యువతి అనుమానాస్పద మృతిపై కర్నూలు మూడవ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సత్వర విచారణ జరగకపోవడంతో మృతిరాలి బంధువులు న్యాయం కోసం ధర్నా చేశారన్నారు. వారిపై పోలీసులు లాఠీచార్జీ చేసినట్టు తమకు ఫిర్యాదు అందిందన్నారు. దీనిపై కమిషన్ తక్షణమే స్పందించి కర్నూలు జిల్లా ఎస్పీని విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కోరామన్నారు. మహిళలపై జరిగే అకృత్యాలను కమిషన్ ఉపేక్షించదని, విచారణలో వెల్లడైన అంశాలపై తక్షణ చర్యలు చేపడతామని శంకరరావు తెలిపారు.

నిస్వార్థసేవకులు వలంటీర్లు



వలంటీర్లను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ కోడుమూరు సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సతీష్

గూడూరు: నిస్వార్థ సేవకులు వలంటీర్లని వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సతీష్ అన్నారు. స్థానిక హరిజనవాడ సచివాలయం-1 లో గురువారం మున్సిపల్ కమిషనర్ వి.దివాకరరెడ్డి అధ్యక్షతన వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఫలాలను ప్రజల వద్దకు చేర్చుతున్న వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శమన్నారు. అవినీతికి తావు లేకుండా పథకాలు అందిస్తూ ప్రజల మన్ననలు అందుకున్నారన్నారు. వారి రుణం తీర్చుకోలేనిదని కొనియాడారు. కమిషనర్ మాట్లాడుతూ వలంటీర్లకు ప్రభుత్వం పారితోషకాలను రెట్టింపు చేసిందన్నారు. సేవా వజ్రకు ఎంపికైన వారికి రూ.45 వేలు, సేవా రత్నకు రూ.30వేలు, సేవా మిత్రలకు రూ.15 వేలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. పట్టణంలో సేవా రత్నకు పి.రేచరి, ఎం.ప్రీతి, వి.పృథ్వీ రాజు, ఎస్.షేక్‌షావలి ఎంపికయ్యారన్నారు. అనంతరం వారిని సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు జే.అబేల్, మున్సిపల్ కౌన్సిలర్లు కలామ్‌బాషా, నందకిషోర్, కుమార్, మెప్మా సీఎంఓ సూర్యనారాయణ పాల్గొన్నారు.

నేడు సి.బెళగల్‌లో..

సి.బెళగల్: అవార్డులకు ఎంపికైన మండల పరిధిలోని పరిధిలోని వలంటీర్లను శుక్రవారం సి.బెళగల్‌లోని కెనరా బ్యాంక్ ఎదురుగా ఉన్న మైదానంలో సత్కరించనున్నట్లు ఎంపీడీఓ శకుంతల పేర్కొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మంగారి ఆలయ ప్రారంభోత్సం



ప్రతిష్ఠించిన పోతులూరి వీరబ్రహేంద్ర స్వామి సమేత మాత గోవిందమాంబ, సిద్ధయ్య దేవతా మూర్తులు



ధ్వజ స్తంభాన్ని ప్రతిష్టిస్తున్న దృశ్యం

- భక్తిశ్రద్ధలతో దేవతా మూర్తులు, ధ్వజస్తంభ ప్రతిష్ట

సి.బెళగల్: మండల కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రారంభోత్సవం, దేవతా మూర్తులు, ధ్వజ స్తంభ ప్రతిష్ట కార్యక్రమాలు వైభవంగా సాగాయి. గట్టు మల్లికార్జున కొండపై రెండు రోజుల పూజల అనంతరం గురువారం వేద పండితులతో ఆలయ ప్రారంభ, ప్రతిష్ట కార్యక్రమాలను నిర్వాహకులు శ్రీనివాసులు ఆచారి నిర్వహించారు. ఉదయం ప్రారంభమైన ప్రతిష్ట పూజా కార్యక్రమాలు మధ్యాహ్నం వరకు కొనసాగాయి. ఆలయ గర్భగుడిలో పోతులూరి వీరబ్రహేంద్ర స్వామి సమేత మాత గోవిందమాంబ, సిద్ధయ్య దేవతా మూర్తులను ప్రతిష్ఠించారు. ఆలయ ప్రాంగణంలో వేంకటేశ్వరస్వామి, ఆంజనేయ స్వామి, నవగ్రహ, సుబ్రహ్మణ్య సాముల విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం, ధ్వజస్తంభాన్ని క్రేన్ సాయంతో భక్తులు గోవింద, శ్రీరామ నామలను స్మరిస్తూ ప్రతిష్ఠించారు. మధ్యాహ్నం ఉత్సవ మూర్తులకు నిర్వహించిన కల్యాణం కమనీయంగా సాగింది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చి స్వామి వార్లను దర్శించుకున్నారు.

కమనీయం.. శ్రీనివాసుడి కల్యాణం

పాణ్యం: మండల కేంద్రంలోని ఎస్సార్బీసీ కాలనీలో వెలసిన శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణం గురువారం వైభవంగా జరిగింది. ప్రతి ఏటా నిర్వహించే కల్యాణ మహోత్సవానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వార్లకు విశిష్ట పూజలు చేశారు. వేద పండితుల మంత్రోత్సరణల మధ్య స్వామి వార్ల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం నుంచి 11గంటల వరకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. అలాగే సాయంత్రం ఉత్సవమూర్తులను కాలనీలోని పురవీధులు, ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వహణ కమిటీ, ఇంజనీర్లు, భక్తులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

పంచాయతీ గదులకు వేలం పాటలు

గడివేముల: స్థానిక పంచాయతీ పరిధిలోని దుకాణాలు, సంతగేటు, మార్కెట్ గేట్లకు గురువారం వేలం పాటలు నిర్వహించారు. గతేడాది కంటే ఈ ఏడాది వేలంపాటల్లో ఆదాయం తగ్గినట్లు ఈఓపీఆర్‌డీ అబ్దుల్‌ఖాలీఖ్, పంచాయతీ కార్యదర్శి తారకేశ్వరీ తెలిపారు.ఐదు దుకాణాలు, సంత,బస్టాండు గేట్లకు గత ఏడాది రూ. 5,80,500 లభించగా, ప్రస్తుతం రూ.5,21,500 వేలం పాటలు పాటల్లో దక్కించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రవణమ్మ, ఉప సర్పంచ్ బాలచెన్ని తదితరులు పాల్గొన్నారు.



వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

సంక్షేమ వారధులు వలంటీర్లు

- కరోనా సమయంలో ప్రాణాలు ఫణంగా పెట్టి ప్రజలకు సేవలు
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- పాణ్యంలో వలంటీర్లకు వందనం



సేవా వజ్ర అవార్డు గ్రహీత జక్కుల వేదవ్యాస్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

పాణ్యం: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే ప్రతి సంక్షేమాన్ని లబ్ధిదారులకు చేరవేస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా నిలిచారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం పాణ్యం ఎంపీడీఓ కార్యాలయంలో వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపుతో వలంటీర్ వ్యవస్థను తెచ్చారన్నారు. అంతే కాక ప్రభుత్వ సంబధమైన ఏ పథకం వచ్చినా వలంటీర్లు అక్కడిక్కడే అర్హతను బట్టి ఆన్‌లైన్‌లో నమోదు చేసి లబ్ధి పొందేలా చేస్తున్నారని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా కరోనా మహమ్మరి విజృభించిన తరుణంలో రక్త సంబధీకులే.. దగ్గరకు రాని సమయంలో వలంటీర్లు తమ ప్రాణాలు ఫణంగా పెట్టి ప్రజలకు సేవ చేశారని గుర్తుచేశారు.

ప్రతిపక్షాలకు విమర్శలను తిప్పికొట్టాలి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వలంటర్ వ్యవస్థలపై మొదటి నుంచి ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఈ వ్యవస్థ వలన అందుతున్న సేవల గురించి మాత్రం వారు మట్లాడరన్నారు. గత ప్రభుత్వ హయంలో జన్మభూమి కమిటీలతో రాష్ట్రాన్ని, ప్రజల రక్తాన్ని పీల్చారన్నారు. మళ్లీ ఈ వ్యవస్థలను తెచ్చేందుకు ప్రతిపక్షాలు ఒక్కటయ్యాయని చెప్పారు. నేడు ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు, గత ప్రభుత్వ నిర్వాకంపై గ్రామాల నాయకులు ప్రజలకు తెలియజేయాలన్నారు.

వలంటీర్లకు సన్మానం

మండలంలో ప్రజలకు సేవలందించిన వలంటీర్లకు ఎమ్మెల్యే కాటసాని సన్మానం చేశారు. తమ్మరాజుపల్లె గ్రామాని చెందిన వలంటీర్ జక్కుల వేదవ్యాస్‌ను సేవా వజ్ర అవార్డుతో సత్కరించారు. ఈయనకు రూ. 45వేలు బహుమతి ప్రభుత్వం అందించనుంది. అలాగే సేవ రత్నలుగా ఆలమూరుకు చెందిన కొర్రపాలు విజయకాంత్, భూపనపాడుకు చెందిన కొప్పుల రాధిక, గోనవరంకు చెందిన మారెడ్డి సువర్ణ, పాణ్యం సచివాలయం-2 చెందిన నాసర సుశీలమ్మ, పాణ్యం సచివాలయం -4కు చెందిన హేమసాని సుమలత ఎంపికయ్యారు. వీరికి రూ.30వేలు చొప్పున అందించనుంది. అలాగే మిగిలిన 232మంది సేవ మిత్రలుగా నిలిచారు. వీరికి రూ.15000లు చొప్పున అందింస్తుంది. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, కో-ఆప్షన్ సభ్యులు జాకీర్, సర్పంచ్ మేకల పల్లవి, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, గగ్గటూరు శ్రీనివాసరెడ్డి, మనోహర్, నాగశేషుడు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పూర్తి స్థాయిలో నిళ్లిచ్చాం

గడిచిన నాలుగున్నరేళ్ల పాలనలో రైతులకు సాగునీటి కష్టాలు లేకుండా పంటలకు పూర్తి స్థాయిలో నీళ్లిచ్చామని, ముందు చూపుతో గోరుకల్లు జలాశయంలో నీరు నిల్వ చేశామని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల పాలనలలో ముందుచూపుతో ప్రాజెక్టులను నింపుకోగలిగామన్నారు. అంతేకాక ఆయకట్టు రైతులకు సంపూర్ణంగా నిళ్లిచ్చామన్నారు. 2014-19 మధ్యకాలంలో టీడీపీ పాలనలో సాగునీటి కోసం రైతులు పడిన ఇబ్బందులు అన్నీఇన్నీ కావన్నారు. సాగునీటికి కోసం రైతులు కాల్వపై పడిగాపులు కాచి, రాత్రి వేళలలో వచ్చిన ఆరకొర నీటితో పొలాలను తడుపుకోవాల్సి వచ్చేదన్నారు. 2019 నుంచి నేటి వరకు ఏ రైతు కూడా సాగు నీటి కోసం ఇబ్బంది పడిన సంఘటనలు లేవన్నారు. ప్రతి ఏడాది పుష్కలంగా నీరు వస్తున్న తరుణంలో ముందుగా గోరుకల్లులో నీటినిల్వ చేసి, తర్వాత వచ్చే నీటిని ఎస్సార్బీసీ ఆయకట్టుకు వదిలేవారమని చెప్పారు. ఈ ఏడాది వర్షాలు పడకపోవడంతో వారబందీ పద్ధతిలో నీటిని ఇచ్చి రైతులకు మరింత భరోసా కల్పించామన్నారు. ఈ ఏడాది కూడా గోరుకల్లు 10టీఎంసీలపైనే నిల్వ చేశామన్నారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా లక్ష ఎకరాలకు నీళ్లిచ్చామని తెలిపారు. గోరుకల్లు బండ్ దెబ్బతినడంతో కేవలం నెలన్నర వ్యవధిలోనే యుద్ధప్రాతిపధికన పనులు చేసి రైతుల్లో భరోసా కల్పించామన్నారు.

తండ్రికొడుల పుణ్యామా అని వర్షాలు దూరం

2019లో ఏ నాడు తక్కువ వర్షాలు కురిసిన సందర్భాలు లేవని, ప్రతిపక్షనాయకుడు చంద్రబాబు, లోకేశ్‌లు రాష్ట్రవ్యాప్తంగా పర్యటించారని వారి పుణ్యామా అని ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురిశాయని విమర్శంచారు. అధికారం కోసం తాపత్రేయపడుతున్నారు తప్పా రైతాంగాన్ని కాని, సాగునీటిపైగా గాని వారు దృష్టి సారించలేదన్నారు.

ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యం



కొత్త ఆరోగ్యశ్రీ కార్డులను వైద్య సిబ్బందికి అందజేస్తున్న దృశ్యం


గడివేముల: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని గడివేముల జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కొత్తగా వచ్చిన ఆరోగ్య శ్రీ కార్డులను వైద్యసిబ్బందికి అందజేశారు. ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఆరోగ్యశ్రీ పరిధిని రూ.25 లక్షల వరకు పెంచిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. వైద్య చికిత్సలు అవసరమైన రాష్ట్ర ప్రజలకు ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని కార్పొరేట్ ఆసుపత్రులు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో ఎక్కడైనా అత్యాధునిక చికిత్స పొందేలా పథకాన్ని విస్తరించారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామిరెడ్డి, ఈఓఆర్‌డీ ఖాలీక్, కో ఆప్షన్ సభ్యుడు ఉశేన్ బాషా, ఉప సర్పంచ్ బాలచెన్ని, వైఎస్సార్‌సీపీ నాయకులు పుల్లయ్య, చంద్రమౌళీశ్వరరెడ్డి, ఏఎస్ఎం మౌలాబీ పాల్గొన్నారు.

కేసీ కాల్వకు నీటి విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కర్నూ లు ప్రజల తాగు నీటి అవసరాల కోసం కేసీ కాల్వ కు గురువారం 159 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో 0.215 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వారు తెలిపారు.


మండల అభివృద్ధికి కృషి చేయండి

సి.బెళగల్: అధికార యంత్రాంగం మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీపీ బొంతల మునెప్ప సూచించారు. గురువారం మండల పరిషత్ సమావేశ భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయా శాఖల ద్వారా గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి అంశాలను, నివేదికలను అధికారులు చదివి వినిపించారు. ప్రభుత్వ కార్యక్రమాల వివరాలను తెలపకపోవడంపై సభ్యులు అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్య వహించవద్దని అధికారులకు సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ శకుంతల, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి, ఏఈఓ సిద్ధు, డాక్టర్ ప్రవీన్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ బొంతల మునెప్ప

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం



కలశ పూజ



గణపతిహోమంలో భక్తులు

కర్నూలు కల్చరల్: స్థానిక ఓల్డ్‌సిటీలోని అంబా భవాని ఆలయంలో ఈనెల 24వ తేదీన జరగనున్న కుమార స్వామి, దత్తాత్రేయ స్వాముల వారి విగ్రహ ప్రతిష్ట, శిఖర కలశ ప్రతిష్టాపన మహోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ప్రారంభ పూజలు నిర్వహించారు. గణపతి పూజ, సప్తమాతృక పూజ, గణపతి హోమం, దీక్షా హోమాలను భక్తిశ్రద్ధలతో జరిగాయి. కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.